# సంపాదకీయం

## డాలరుకు ఎసరొస్తోందా! ట్రంప్ బెదిరింపులకు అర్థమేమిటి?

తమ కరెన్సీ డాలరును పక్కన పెట్టి ప్రత్యామ్నాయ కరెన్సీతో వాణిజ్యం జరిపేందుకు 'బ్రిక్స్' కూటమి దేశాలు పూనుకుంటే వందశాతం పన్ను విధిస్తామని జనవరి 20న పదవీ బాధ్యతలు చేపట్టనున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బెదిరించాడు.బ్రిక్స్ దేశాలని, వేరే కరెన్సీ అని చెప్పినప్పటికీ స్థానిక కరెన్సీలతో లావాదేవీలు జరిపే అన్ని దేశా లకూ వర్తింపచేస్తామనే హెచ్చరిక దీని వెనుక ఉంది.ప్రస్తుతం బ్రిక్స్‌లో బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా, ఇరాన్,ఈజిప్టు, ఇథియోపియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఏయి) ఉన్నాయి.మరో 34 దేశాలు చేరేందుకు ఆసక్తి వ్యక్తం చేశాయి. వాటిని నిరుత్సాహపరిచేందుకు కూడా ట్రంప్ ఈ ప్రకటన చేశాడు. నిజానికి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ ఏడాది మార్చి నెలలోనే దీని గురించి చెప్పాడు. ఆర్‌బిఐ మాజీ గవర్నర్ దువ్వూరు సుబ్బారావు వంటి వారు ట్రంప్ మాటలు ఊకదంపుడేనా, నిజంగా అమలు జరుగుతాయా, అమెరికా చట్టాలు అందుకు అనుమతిస్తాయా? అన్న సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. చైనా వస్తువుల మీద పదిశాతం, కెనడా, మెక్సికోల నుంచి వచ్చే వాటి మీద 25శాతం పన్ను విధిస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. చర్యకు ప్రతిచర్య ఉంటుంది, అది ఏ రూపంలో అన్నది చూడాల్సిఉంది. మొదటి ప్రపంచ యుద్ధం వరకు ప్రపంచ మారకపు కరెన్సీగా బ్రిటీష్ పౌండు ఉన్నది. 1920దశకం నుంచి డాలరు క్రమంగా పెరిగి పౌండ్‌ను వెనక్కునెట్టింది. రెండో ప్రపంచ యుద్ధ ముగింపులో ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థల ఏర్పాటు తరువాత పూర్తిగా డాలరు పెత్తనం ప్రారంభమైంది. గతంలో ఒక ఔన్సు(28.35 గ్రాములు) బంగారం 35 డాలర్లకు సమానమైనదిగా మారకపు విలువ నిర్ణయించారు. 2024 డిసెంబరు రెండవ తేదీన ఒక ఔన్సు బంగారం ధర 2,626 డాలర్లు ఉంది. 1971లో డాలరు-బంగారం బంధాన్ని తెంచిన తరువాత డాలరుకు ఎదురులేకుండా పోయింది. దాన్ని అడ్డుకొనేందుకు ఐరోపా ధనికదేశాలు యూరో కరెన్సీని ముందుకు తెచ్చినా డాలరుకు ప్రత్యామ్నాయం కాలేకపోయింది. గత పదిహేనేండ్లుగా డాలరు ప్రభావం క్రమంగా తగ్గుతోంది. రాజకీయంగా తమ పెత్తనానికి ఎదురు దెబ్బలు తగులుతున్న పూర్వరంగంలో ఆర్థికంగా నిలిచి ప్రపంచ ఆధిపత్యాన్ని నిలుపుకోవాలని అమె రికా చూస్తున్నది, అదే ట్రంప్ అజెండా, దానికనుగుణంగా ప్రకటనలు ఉన్నాయి.అయితే అది జరిగేనా? డాలరుకు ప్రత్యామ్నాయ కరెన్సీని ముందుకు తేవాలని బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డిసిల్వా 2023లో ప్రతిపాదించాడు. అంతకుముందు నుంచే దీని గురించి చర్చ ఉంది. డాలరును ఉపయోగించవద్దని ఏ దేశం మీద కూడా ఒత్తిడి తేవద్దని, బ్రిక్స్ మద్దతు ఇచ్చే కరెన్సీలో చెల్లింపులు పెరగాలని, దుర్బలత్వాలను తగ్గించుకోవాలని లూలా అన్నాడు. తనకు నచ్చని దేశాల మీద డాలరును అమెరికా ఆయుధంగా ఉపయోగిస్తున్నది. ఇరాన్‌తో లావాదేవీలపై అమెరికా నిషేధం విధించిన కారణంగా మనదేశం అక్కడి నుంచి చమురు కొనుగోలు నిలిపివేసింది. ఉక్రెయిన్ సంక్షోభానికి రష్యా ఒక్కదాన్నే బాధ్యు రాలిగా చేస్తూ దాని మీద కూడా అమెరికా తీవ్రమైన ఆంక్షలు విధించింది. అక్కడి నుంచి ముడి చమురు కొనుగోలు చేసేందుకు మన ప్రభుత్వం ఇతర కరెన్సీలతో కొనుగోలు చేయాల్సి వచ్చింది.మరోవైపు మన కరెన్సీని అంగీకరించే విధంగా 23 దేశాలతో ఇప్పటికే అవగాహనకు వచ్చిన సంగతి తెలిసిందే. రూపాయితో లావాదేవీలు జరిగితే ఎగుమతి, దిగుమతిదార్లకు కరెన్సీ మారకపు విలువ హెచ్చుతగ్గుల ముప్పు ఉండదు. మన విదేశీ వాణిజ్యంలో మూడోవంతు ఈ దేశాలతోనే జరుగుతున్నది.అమెరికాతో ఉన్న రాజకీయ బంధం, డాలరుతో తెగతెంపులు చేసుకోవటం పూర్తిగా ఇష్టం లేని కారణంగా మనదేశం ఇరకాటవస్థలో ఉంది.తామెన్నడూ డాలరును దెబ్బతీసేందుకు లక్ష్యంగా చేసుకోలేదని మన విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ చెప్పారు. కొన్ని సందర్భాలలో తమ వాణిజ్య భాగస్వాములకు డాలర్లు ఉండటం లేదని, ఆ కారణంగా ప్రత్యామ్నాయాలను చూస్తున్నాం తప్ప ఎలాంటి దురుద్దేశ్యాలు లేవని చెప్పారు. చైనాతో మన వాణిజ్యం లోటులో ఉండగా అమెరికాతో మిగులులో ఉంది. ఈ కారణంగానే దానితో సంబంధాల విషయంలో మనదేశం ఆచితూచి వ్యవహరిస్తున్నది. ఉమ్మడి కరెన్సీ పథకాలకు దూరంగా ఉంటోంది. కొన్ని లావాదేవీల్లో డాలర్లకు ఆటంకాలు ఉన్నందున స్థానిక కరెన్సీలతో ఏర్పాట్లు చేసుకుంటున్నది.డాలరుతో తెగతెంపులు చేసుకొనేందుకు, తద్వారా అమెరికా మార్కెట్‌ను కోల్పోయేందుకు మనదేశంలోని ఐటి, దాని అనుబంధ, సేవారంగాల్లో, ఔషధ, వస్త్ర పరిశ్రమల కార్పొరేట్లు అంగీకరించే అవకాశం లేదు. కార్పొరేట్ శక్తులు పశ్చిమదేశాల మార్కెట్ మీద కేంద్రీకరించిన కారణం కూడా విస్మరించరానిదే. మనదేశం డాలర్ పెట్టుబడులను ఆశిస్తున్నం దున దాన్ని దెబ్బతీసేందుకు ముందుకు పోదన్నది అభిప్రాయం. బ్రిక్స్ కూటమి జీడీపీలో 70శాతం వాటా చైనాదే. ప్రత్యామ్నాయ కరెన్సీ రూపొందితే దానిలో ఆధిపత్యం ఉండే అవకాశం ఉంది, రాజకీయంగా దాన్ని ఎదుర్కోవాలని కోరుతున్న మనదేశంలోని చైనా వ్యతిరేకశక్తులు అంగీకరించే అవకాశం కూడా లేదు. 'అంతర్జాతీయ వాణిజ్యంలో డాలరుకు బదులు మరో కరెన్సీని వినియోగించే అవకాశం లేదు. ఎవరైనా అలాంటి ప్రయత్నాలు చేస్తే అమెరికాకు వీడ్కోలు చెప్పాల్సి ఉంటుంది. బ్రిక్స్ దేశాలు డాలరుకు దూరంగా ఉండాలని ప్రయత్ని స్తుండటాన్ని మేము గమనించటం ముగిసింది. అద్భుతమైన అమెరికా ఆర్థిక వ్యవస్థలో తమ వస్తువులను అమ్ముకోవటానికి స్వస్తి పలకాల్సి ఉంటుంది' అని ట్రంప్ బెదిరించాడు. ప్రస్తుతం డాలర్‌దే ఆధిపత్యమైనా అన్ని దేశాలూ తమ విదేశీమారక ద్రవ్యంలో ఒక్క డాలరు మీదే ఆధారపడటం లేదు. ఇతర కరెన్సీలను కూడా నిల్వ చేసుకుంటున్నాయి. ఇదే సమయంలో ఎటుబోయి ఎటువస్తుందో అన్నట్లుగా బంగారం నిల్వలను కూడా పెంచుకుంటున్నాయి. ఇరాన్, రష్యా దేశాలపై ఆంక్షలు విధించి తన సొంతచట్టాలను రుద్దుతోంది. దానిలో భాగంగా అంతర్జాతీయ అంతర బ్యాంకుల ద్రవ్య లావాదేవీల టెలికమ్యూనికేషన్ సమాజ (స్విఫ్ట్) వ్యవస్థ నుంచి వాటిని ఏకపక్షంగా తొలగించింది. రేపు తనకు నచ్చని లేదా లొంగని ఏ దేశం మీదనైనా ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడవచ్చు గనుక గత కొన్నేండ్లుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, కరెన్సీల గురించి ఆలోచిస్తున్నాయి. బ్రిక్స్ దేశాలు ప్రపంచ వాణిజ్యంలో 23శాతం కలిగి ఉన్నాయి. ఇవి నూతన కరెన్సీని సృష్టించటం లేదా డాలరును పక్కనపెట్టే మరొక కరెన్సీకి మద్దతు ఇవ్వబోమని తమకు హామీ ఇవ్వాలని డోనాల్డ్ ట్రంప్ డిమాండ్ చేశాడు. మహావృక్షం వంటి డాలరుకు బదులు మరొక పిలక కోసం ప్రయత్నించినా ఫలితం ఉండదన్నాడు. సార్వభౌమత్వం కలిగిన ఏ దేశమూ ఇలాంటి హామీ ఇవ్వదు.

# ఇతిహాసపు చీకటి కోణాన్ని చెరిపేపేద్దాం



బాల్య వివాహాలు పాతకాలం నాటి మాట. కానీ ఆ అనాచారం నేటికీ కొనసాగుతోంది. స్త్రీ శక్తి ఏమిటో ప్రపంచానికి తెలిసిన ఈ రోజుల్లోనూ బాల్య వివాహాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఐదుగురు మహిళల్లో ఒకరికి 18 ఏళ్ల లోపే వివాహం జరుగుతున్నట్లు 'ది లాన్సెట్ జర్నల్' వెల్లడించింది. అంతేకాదు కోవిడ్ తర్వాత ప్రపంచవ్యాప్తంగా చదువులు చతికిల బడ్డాయి. పేదరికం పెరిగిపోయింది. ఫలితంగా వచ్చే దశాబ్ద కాలంలో కోటి మంది బాలికలువివాహ చట్రంలో ఇరుక్కుపోనున్నారు. ఏటా 1.2 కోట్ల మంది బాల్యంలోనే వివాహ వ్యవస్థలోకి నెట్టబడతా రని లాన్సెట్ చెబుతోంది. బాల్య వివాహాలు ఆడపిల్లల ఆరోగ్యానికి, జీవితానికి ముప్పు. లేత శరీరా లు.. తెలియని వయసు, పరిపక్వతలేని మనసు, అమ్మపై ఆధారపడే వయస్సులో అమ్మగా మార డం ఆ చిన్నారి ఎదుగుదలకు ఆటంకం.÷ాల్య వివాహాలు నిరోధించడానికి రాజారామ్ మోహన్‌రారు, కందుకూరి వీరేశలింగం వంటివారు కృషి చేసినా ఈ మూఢాచారం నేటికీ కొనసాగటం దురదృష్ట కరం. తల్లి గర్భం నుంచే సమాజంతో నిత్యం పోరాటం చేయాల్సిన పరిస్థితి బాలికలది. సాధ్య మైనంత త్వరగా ఆడపిల్లకు పెళ్లి చేసి వదిలించుకోవాలన్న పురుషాధిక్య భావజాలం ఆడపిల్ల అందమైన కలలను, భవితను, జీవితాన్ని చిదిమేస్తోంది. చదువు, ఆటపాటలతో ఎదగాల్సిన బాలి కలు చిన్న వయసులో పెళ్లి వల్ల శారీరకంగా, మానసికంగా బలహీనులవుతారు. శారీరక, మాన సిక పరిపక్వత లేని వయసులో గర్భం ధరించడం వల్ల మాతాశిశు మరణాలు పెరుగుతు న్నాయి. ముఖ్యంగా బాల్య వివాహాల వల్ల చిన్నతనం నుంచే వారి హక్కులు ఉల్లంఘించబడుతూ, ఆర్థిక పరాధీనతను పెంచుతున్నాయి. 'బాల్య వివాహాలు బానిసత్వం యొక్క ఒక రూపం. దానిని రద్దు చేయాలి' అన్నారు నెల్సన్ మండేలా. బాల్య వివాహాలు సామాజిక దురాచారం. వీటిని అరికట్టడం వలన మాతా శిశు మరణాల సంఖ్య గణనీయంగా తగ్గుతుంది. దేశవ్యాప్తంగా బాల్య వివాహాలు అత్యధికంగా జరుగుతున్న ఏడు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. దేశంలో దాదాపు 300 జిల్లాల్లో జాతీయ సగటుతో పోలిస్తే బాల్య వివాహాల రేటు ఎక్కువగా వుందని తాజాగా ప్రభుత్వ నివేదికలు వెల్లడిస్తున్నాయి. భారత దేశంలో మొట్టమొదటిగా 1929లో బాల్య వివాహాలు నిషేధించబడ్డాయి. ఆ తర్వాత క్రమంగా పరిస్థితి మరింత మెరుగుపడుతూ వచ్చింది. అయినా నేటికీ బాల్య వివాహాలు జరుగుతూనే వున్నాయి. 8 ఏళ్లలోపు బాలికలు, 21 ఏళ్ల లోపు బాలురకు వివాహాలు చేస్తే, తల్లిదం డ్రులతోపాటు వివాహం చేసిన వారికి కూడా రెండేళ్లపాటు జైలుశిక్ష విధిస్తారని చట్టం చెబుతోంది. బాలలకు చట్టంలో సమానత్వం వుందని, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా చైతన్యం రావాలని తాజాగా కేంద్ర ప్రభుత్వం 'బాల్ వివాహ్ ముక్త్ భారత్' కార్యక్రమం చేపట్టింది. 2030 నాటికి బాల్య వివాహ రహిత భారతదేశమే లక్ష్యంగా ముందుకెళ్లాలని ప్రభుత్వం చెబుతోంది.


మరోవైపున దేశవ్యాప్తంగా బాల్యవివాహాలు నిరాఘాటంగా జరుగుతున్నాయి.

మనిషి కథ ఆరంభమైన చోటనే అంతం కాకూడదు, అది సంతాపంగా మారకూడదు. ఆడపిల్ల చదువు ఇంటికి వెలుగు. బాల్య వివాహ వ్యవస్థను రూపుమాపేది, వారి జీవితాన్ని వెలుగు దివ్వెగా మార్చేది, పురుషాధిక్యతను ప్రశ్నించేది చదువు మాత్రమే. ఇది నిషిద్ధ స్వప్నం కాదు. ఈ పురుషాధిపత్య సంకెళ్లను ఛేదించి, తమ పూర్తి సామర్థ్యాన్ని చేరుకునే సాధికారయత్నం. ఇతిహాసపు చీకటి కోణాన్ని చెరిపేసి ఆడబిడ్డను బతకనివ్వాలి.. ఎదగనివ్వాలి..చదవనివ్వాలి? ఎగరనివ్వాలి.

# కులరక్కసి రక్తదాహం

కులోన్మాదం ఎంతటి దారుణానికైనా ఒడిగడుతున్నది. ఆ ఉన్మాదం తలకెక్కి సొంతవారినే బలితీసుకుంటున్న పరిస్థితి నెలకొంది. తక్కువ కులం వ్యక్తిని పెండ్లి చేసుకున్నారని కడుపున పుట్టిన పిల్లల్ని సైతం పొట్టన పెట్టుకుంటున్న సమాజంగా దిగజారింది. పరువు పేరుతో రక్త పంచుకు పుట్టినవారి ప్రాణాలు నిలువునా తీస్తున్న దుస్థితికి చేరడం ఆందోళన కలిగిస్తోంది. అలాంటి ఘటనే రెండు రోజులు కిందట హైదరాబాద్ మహానగరానికి కూతవేటు దూరంలోని ఇబ్రహీంపట్నంలో జరిగింది.

ప్రేమించిన వ్యక్తిని పెండ్లి చేసుకున్నందుకు తమ్ముడి చేతిలో మహిళా కానిస్టేబుల్ విగతజీవిగా మారింది. పెండ్లి చేసుకున్న ఇరవైరెండు రోజులకే కడతేరిపోయింది. ఈ ఘటనలో కులంతో పాటు ఆర్థికాంశం కూడా ప్రధాన భూమిక పోషించింది. కులం తక్కువ వ్యక్తిని పెండ్లి చేసుకున్నందుకు తల్లి ద్వారా ఆమెకు సంక్రమించిన ఎకరం పొలాన్ని తిరిగి తన పేర రాయమంటూ ఇబ్బంది పెట్టాడు తమ్ముడు. రాసిన తర్వాత భవిష్యత్తులో మళ్లీ ఎక్కడ పేచీకి వస్తుందోనని, ఇకపై ఆ ఆస్తితో ఆమెకు ఎలాంటి సంబంధం వుండబోదని సంతకాలు పెట్టమని బెదిరింపులకు గురిచేశాడు. ఆమె దానికి ఒప్పుకోకపోవడంతో కక్ష పెంచుకున్నాడు. అవకాశం కోసం ఎదురుచూసి కారుతో గుద్ది, కొడవలితో దాడిచేసి ఆస్తికి అడ్డులేకుండా పాశవికంగా హత్యచేశాడు.




సమాజంలో తరతరాలుగా కొనసాగుతున్న కుల వివక్షకే కాదు, లింగ వివక్షకూ ఈ ఉదంతాన్ని ఓ ఉదాహరణగా చూడొచ్చు. మనుషులు ఇలా కులం కోసం, ఆస్తి కోసం ప్రాణాలు తీస్తూ దారుణాలకు పాల్పడుతున్నారు. కాదు కాదు.. ఇలాంటి పరిస్థితుల్లోకి నెట్టివేయబడుతున్నారు. మానవ విలువలు, కుటుంబ విలువలను మంటగలుపుతున్నారు. కులోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న నేటి సమాజం వీటికి పరువు హత్యలు, హానర్ కిల్లింగ్స్ అంటూ గౌరవ ప్రదమైన పేర్లతో పిలుస్తోంది. ఇలాంటి హత్యలకు బలైపోతున్న వారు ముఖ్యంగా దళితులు, మహిళలే. వాస్తవానికి ఇవన్నీ కులదురహంకార హత్యలు. సమాజం ప్రజలపై రుద్దిన మూర?త్వపు మూఢాచారాలకు నిదర్శనాలు. అలాంటి మూఢాచారాలను పెంచిపోషిస్తున్న ప్రతి ఒక్కరికీ ఈ హత్యల్లో భాగమున్నట్టే. ఒకప్పుడు కులదురహంకార హత్యలు ఉత్తర భారతదేశానికి మాత్రమే పరిమితం. కానీ ఇప్పుడు దక్షిణ భారతదేశానికి కూడా వ్యాపిం చాయి. మరీ ముఖ్యంగా తమిళనాడు, ఆంధ్రా, తెలంగాణలో ఇటీవల కాలంలో కులోన్మాద హత్యల సంఖ్య నానాటికి పెరిగిపోతోంది. 'చంపకపోతే మనకు పరువు లేదు, చంపితేనే మన కులగౌరవాన్ని నిలబెట్టిన వాళ్ళు అవుతారు' అంటూ ఇలాంటి హత్యలను రెచ్చగొడుతున్న వారు చుట్టూ ఎందరో ఉన్నారు. ఇక మనిషి అణువణువునా అంటరాని తనాన్ని జొప్పించే మనువాదాన్ని నెత్తిన పెట్టుకు తిరుగుతున్న నేటి బీజేపీ పాలనలో కులదురహంకార హత్యలు పెరగడంలో ఆశ్చర్యమేముంది. మనుధర్మం మనుషులను ముక్కలుగా చేస్తోంది. కుల, మతాల గీతలు గీసుకుని బయటి ప్రపంచాన్ని చూడలేక దేశం తిరోగమన దారిపట్టింది. అంటరానితనం అమానుషం అని స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి చెప్పుకుంటూనే ఉన్నాం. అయినా కులం తన పంజా విసురుతూనే ఉంది. తక్కువ కులాలపై కత్తులతో దాడి చేస్తూనే ఉంది. దీనికి కారణమెవరు? కచ్చి తంగా స్వార్థ రాజకీయాలే. తమ రాజకీయాలకు అనుకూలంగా వీటిని మార్చుకుంటున్నారు. కులాల మధ్య చిచ్చురేపి అధికారాన్ని నిలబెట్టుకో వాలని చూసే నాయకులు ఉన్నంత కాలం కులం ఇలా వర్ధిల్లుతూనే ఉంటుంది. పరువు పేరుతో ఎంతమందినైనా పొట్టన పెట్టుకుంటుంది. అందుకే కులాంతర వివాహాల సమస్యను కేవలం కుటుంబ వ్యవహారంగా కాక అదొక సామాజిక సమస్యగా పరిగణించాల్సిన అవసరం ఉంది. ప్రేమ పెండ్లి చేసుకున్నందువల్ల గత రెండు శతాబ్దాల్లో దేశ వ్యాప్తంగా 44,412 హత్యలు జరిగాయని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. బయటపడని కేసులను కూడా లెక్కకడితే ఈ సంఖ్య మరింత పెరుగుతుంది.

ఈ నేపథ్యంలో కులదురహంకార హత్యలను నివారించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ ప్రభుత్వాలు వాటి జోలికి వెళ్లే ధైర్యం చేయడం లేదు. సీపీఐ(ఎం) దీనికి సంబంధించిన ముసాయిదా బిల్లును 15 ఏండ్ల కిందటే ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వానికి అందజేసింది. బాధితులకు షెల్టర్, పరిహారం, కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్న వారికి రక్షణ తదితర అంశాలు ఆ బిల్లులో పొందుపరిచింది. కానీ నాటి కాంగ్రెస్‌కు గానీ, నేటి బీజేపీకి గానీ ఆ చట్టం రావడం ఇష్టం లేదు. అందుకే మౌనంగా ఉన్నాయి. అయితే రాజకీయ జోక్యం లేకుండా కేవలం సామాజిక అభివృద్ధి ద్వారా మాత్రమే కుల నిర్మూలన, లింగ సమానత్వం అసాధ్యమని అంబేద్కర్ ఏనాడో చెప్పాడు. కనుక ఇప్పటికైనా ప్రభుత్వాలు దీనిపై దృష్టిపెట్టాలి. కుల దురహంకార హత్యల నిరోధానికి ప్రత్యేక చట్టం రూపొం దించాలి. ఇలాంటి హత్యలను నివారించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. కుల వివక్షను, ఇలాంటి దారుణాలను తీవ్రంగా పరిగణించి అరికట్టడం ప్రభుత్వాల విధి.

